## క్లుప్తంగా

### దివ్యాంగ పింఛన్ల పరిశీలన



మలకపల్లిలో పింఛనుదారుల నుంచి వివరాలను సేకరిస్తున్న డాక్టర్ల బృందం

**తాళ్లపూడి:** దివ్యాంగ పింఛన్లను పరిశీలిస్తున్నట్టు ఎంపీడీవో టీబీ వెంకట రమణ తెలిపారు. మండలంలోని 15 సచివాలయాల పరిధిలోని ఉన్న 53 దివ్యాంగ పింఛను పొందుతున్నారని, వారి నుంచి వివరాలను సేకరించడానికి ముగ్గురు వైద్యుల బృందం శుక్రవారం మండలంలో పర్యటించి వివరాలను సేకరించినట్టు తెలిపారు. వారి వద్ద నుంచి సర్టిఫికెట్లను పరిశీలించామని తెలిపారు. బోగస్ పింఛన్లను ఏరివేయడంలో కార్యక్రమం ఉద్దేశమన్నారు.

### 30 మందిపై కేసు నమోదు

**తాళ్లపూడి:** అన్నదేవరపేట వద్ద జగనన్న కాలనీ వాసులు కొత్త ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అక్కడ ఇళ్లు నిర్మించుకున్న వారందరికి ఇప్పటి వరకు కరెంట్ మీటర్లు ఇవ్వలేదు సరి కదా, శుక్రవారం కొంత మంది విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం వచ్చి దొంగ కరెంట్ వాడుతున్నారంటూ కేసులు రాసి వెళ్లారని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో కొంతమందికి మాత్రం ఉచిత కరెంట్ ఇచ్చారని, మరి కొంత మందికి మీటర్లు వస్తాయని అధికారులు చెబుతూనే ఉన్నారని ఇప్పటి వరకు ఇవ్వలేదని తెలిపారు. ఉచిత కరెంట్ కదా అని స్తంభాలపై వైర్లు వేసుకుంటే దొంగ కరెంట్ వాడుతున్నారని కేసులు నమోదు చేయడంపై కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 30 మంది పై కేసులు రాసారని తెలిపారు.

### సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



కొవ్వూరులో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

**కొవ్వూరు:** అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న వారికి ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. వేములూరు గ్రామానికి చెందిన మద్దిపాటి సుబ్బలక్ష్మికి రూ.81వేలు, కొవ్వూరు పట్టణానికి చెందిన కమిడి అర్చనకి రూ.25,655, పోతాబత్తుల ఉమాదేవికి రూ.53,350 చొప్పున ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, కౌన్సిలర్ బొండాడ సత్యనా రాయణ, పెనుమాక జయరాజు, వేమగిరి వెంక్రటావు తదితరులు పాల్గొన్నారు.

### అమిత్‌షా పర్యటనను వ్యతిరేకించాలి

**నిడదవోలు :** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను రాష్ట్ర వ్యాప్తంగా వ్యతిరేకించాలని కోరుతూ వామపక్షాల పిలుపు మేరకు ఈనెల 19వ జరగనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జువ్వల రాంబాబు కోరారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అవమానకరంగా రాజ్యసభలో మాట్లాడారు. అంబేడ్కర్‌ని అభిమానించే వాళ్లను ఎగతాళి చేస్తూ అంబేడ్కర్‌ను జపం చేయడం ఫ్యాషన్‌గా మారిపోయిందని అదేదో ఏ దేవుడ్ని జపం చేసుకుంటే స్వర్గం ప్రాప్తి లభించేదని మాట్లాడారు. దీనిపై దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. అయినా బీజేపీ ప్రభుత్వం కాని, ప్రధాని మోదీ గాని స్పందించలేదన్నారు. అమిత్‌షా ఈనెల 19వ తేదీన విజయవాడ పర్యటనకు వస్తున్న సందర్భంగా 'గోబ్యాక్ అమిత్ షా' అంటూ వామ పక్ష పార్టీలు పిలుపు ఇచ్చాయని రాంబాబు పేర్కొన్నారు.

### రేపు కొత్త రేషన్ డిపోల కోసం రాత పరీక్ష

**పెరవలి:** కొత్తగా రేషన్ డిపోలు కావాలనుకునే అభ్యర్థులు ఆదివారం కొవ్వూరులో జరిగే రాత పరీక్షకు హాజరుకావాలని తహసీల్దార్ డి.అచ్యుతాకుమారి తెలిపారు. పెరవలి మండలంలో 6 రేషన్ డిపోలకు అభ్యర్థులను ఎంపిక చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారని, దీని నిమిత్తం 19వ తేదీ ఉదయం 10 గంటలకు కొవ్వూరులో ఏబీఎస్ అండ్ పీఆర్ఆర్ కాలేజీలో రాత పరీక్ష జరుగుతుందన్నారు.

### ఐదుగురిపై కేసు

**చాగల్లు:** ఊనగట్లలో హిజ్రాలతో అశ్లీల నృత్యాలు వేయిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.నరేంద్ర శుక్రవారం తెలిపారు. ఊనగట్ల గ్రామంలో ఈనెల 16వ తేదీ గురువారం రాత్రి హిజ్రాలతో అశ్లీల నృత్యాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి అదే గ్రామానికి చెందిన నలుగురు, చాగల్లుకు చెందిన మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. వారితో పాటు సౌండ్ సిస్టం, ఒక వాహనం సీజ్ చేసినట్లు ఎస్సై నరేంద్ర చెప్పారు.

# డంపింగ్ యార్డుగా జాతీయ రహదారి

- గ్రామాల్లో రోడ్డు పక్కనే చెత్త
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



మల్లేశ్వరం వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న చెత్త కుప్పలు



అన్నవరప్పాడు వద్ద జాతీయ రహదారిపై చెత్త కుప్పలు

**పెరవలి:** జాతీయ రహదారి డంపింగ్‌యార్డుగా దర్శనమిస్తోంది. గ్రామాల్లోని చెత్తను సేకరించి హైవేపై వేయడంతో గ్రామ ప్రారంభంలో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో గ్రామాల్లోకి వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. అంతేకాకుండా ఆ చెత్తకు నిప్పు అంటించడం వల్ల పొగ కమ్ముకుని రోడ్డులో వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. కూడళ్ల వద్ద అడ్డూ అదుపు లేకుండా చెత్తను పట్టుకొచ్చి వేస్తున్నాఅధికారులు ఎటు వంటి చర్యలు తీసుకోకపోవడంతో మరింత చెత్తను వేస్తున్నారు.

**ప్రతి గ్రామం వద్ద..**

పెరవలి నుంచి సిద్ధాంత వరకు జాతీయ రహదారి 13 కిలోమీటర్లు ఉండగా ఇందులో ప్రతి గ్రామం వద్ద ఈ చెత్త కుప్పలు దర్శినమిస్తున్నాయి. ఈ చెత్త కుప్పల వలన అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గాలివీచినప్పుడు, వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు చెత్త నుంచి కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు ఎగిరి వచ్చి వాహనాలపై పడడంతో డ్రైవర్లు వాటిని తీయబోయి ప్రమాదం బారిన పడుతున్నారు. పెరవలిలో జాతీయ రహదారి ఇరువైపులా కాఫీ, భోజన హోటళ్లు, వ్యాపార సంస్థలు ఉండడంతో నిత్యం చెత్తను పట్టుకుని వచ్చి రోడ్డు పక్కనే వేస్తున్నారు. అంతే కాకుండా నిల్వ పదార్థాలను ఇక్కడే వేయడంతో ప్రజలు, వాహనదారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవే కాకుండా కోళ్లు, చేపల వర్థాలు కూడా ఇక్కడే పడేస్తున్నారు. స్థానిక పంచాయతీ అధికారులు అప్పుడప్పుడూ చెత్తను తొలగిస్తున్నా ఇబ్బందులు మాత్రం తప్పటం లేదని వాపోతున్నారు. ఈ రహదారి ఇరువైపులా ఉండే నివాసకులు నానా అగచాట్లు పడుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనాల వేగంతో పాటు ఈ చెత్తనుంచి వచ్చే చెడువాసనలు భరించలేకపోతున్నామని వాపోతున్నారు.

**చెత్తకు నిప్పు పెట్టడంతో..**

అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో చెత్తకుప్పలకు నిప్పు పెట్టి వదిలివేయడంతో తడిగా ఉండడంతో వీటి నుంచి వచ్చే పొగతో నానా అవస్థలు పడుతున్నారు. రహదారిని ఆనుకుని ఉన్న పెరవలి, నల్లాకులవారిపాలెం, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు గ్రామాల వద్ద చెత్త కుప్పలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గతంలో తూర్పు గోదావరి జిల్లా కలక్టర్ కె.మాదవీలత ఇటీవల అన్నవరప్పాడు వచ్చినప్పుడు ఇది జాతీయ రహదారా లేక డంపింగ్ యార్డులా అంటూ పంచాయతీ అధికారులను నిలదీశారు. తాను మరలా వచ్చినప్పుడు పరిస్థితి ఇలాగే ఉంటే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. కానీ అధికారులు మాత్రం పట్టించుకోలేదు. ఇప్పటికైనా జాతీయ రహదారిని శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఖండవల్లి వద్ద చెత్తకుప్పలు తగలబెట్టటంతో రోడ్డుపైకి వస్తున్న పొగ

**దుర్వాసన భరించలేకపోతున్నాం**



జాతీయ రహదారిపై ప్రయాణం అంటే భయమేస్తోంది. చెత్తకుప్పల నుంచి దుర్వాసన భరించలేకపోతున్నాం. ముక్కుమూసుకుని వెళ్లాల్సిందే. అధికారులు పట్టించుకోవడం లేదు.

– చిన్నం సత్తిపండు, ఖండవల్లి

**అధికారులు చర్యలు తీసుకోవాలి**



డంపింగ్‌యార్డుకు నిలయంగా జాతీయ రహదారి ఉందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థంచేసుకోవచ్చు. గ్రామ కూడళ్ల వద్ద చెత్తా చెదారం వేయడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. గ్రామానికి వచ్చిన వాళ్లకు చెత్తే ముందుగా దర్శనమిస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి

– గుమ్మాపు చిత్రసేన్, పెరవలి

### లక్ష్మీ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు




ప్రత్యేక పూజలు అందుకున్న లక్ష్మీ గణపతి

**గోపాలపురం:** స్థానిక రాజరాజేశ్వరి టౌన్ షిప్ ఆవరణలో వెలసిన లక్ష్మీ గణపతి ఆలయంలో శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకటహర చతుర్థి సందర్భంగా లక్ష్మీ గణపతి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గౌతం శర్మ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# సైబర్ నేరాలపై అవగాహన

**ఆకట్టుకుంటున్న మూడు కోతుల బొమ్మలు**




సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న మూడు కోతుల బొమ్మలు

**కొవ్వూరు:** చెడు వినకు, చెడు మాట్లాడుకు, చెడు చూడకు అంటూ మూడు కోతుల బొమ్మలు మనం తరచూ చూసే ఉంటాం. ఇప్పుడు పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంచేందుకు పోలీసు అధికారులు కొత్త అర్థం చెబుతున్నారు. సైబర్ నేరగాళ్లు జనాన్ని బురుడీ కొట్టించి వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు కాజేస్తున్నారు. ఎంతో మంది అమాయకులు అవగాహనా రహిత్యంతో నిత్యం మోసపోతున్నారు. ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించే ప్రయత్నంలో భాగంగా మూడు కోతుల బొమ్మలు చెప్పే అర్థాలకు కొత్త భాష్యం చెబుతున్నారు. డోంట్ టెల్ ఓటీపీ టూ ఎనీవన్(మీ ఓటీపీలు ఎవరికి చెప్పవద్దు), డోంట్ లిజన్ ఫేక్ కాల్స్(చెడు కాల్స్ వినవద్దు), డోంట్ ఓపెన్ అన్‌నోన్ లింక్స్ (అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులను తెరవ వద్దు) అంటూ మూడు కోతుల బొమ్మలతో సోషల్ మీడియాలో వస్తున్న ఈ బొమ్మలు అందరిని ఆకట్టు కుంటున్నాయి. సైబర్ నేరాల నియంత్రణలో ప్రజల్లో అవగాహన పెంచేందుకు కొత్త పోకడలు రావడంతో ప్రజలు సైతం వీటిని ఆసక్తిగా గమనిస్తున్నారు.

# పాఠశాల విద్య బలోపేతం దిశగా చర్యలు

- ఇకపై ఐదు రకాల బడులు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు



నల్లజర్ల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న క్లస్టర్ కమిటీల సమావేశం

**నల్లజర్ల:** ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించే దిశగా విద్యా శాఖ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐదు బడుల విధానాన్ని అమలులోకి తీసుకురావడానికి కసరత్తు ప్రారంభించింది. పాఠశాల కమిషనర్ ఆదేశాల మేరకు నల్లజర్ల ఎంఈఓ కార్యాలయంలో బడుల రీస్ట్రక్చర్ అమలుపై క్లస్టర్ స్థాయి కమిటీల సమావేశం శుక్రవారం జరిగింది. ప్రతి క్లస్టర్‌లో క్లస్టర్ స్కూలు హెచ్‌ఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఎంఈఓ-1, 2 సభ్యులుగా ఉంటారు. శాటిలైట్, ఫౌండేషన్ స్కూల్, బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ స్కూల్, హైస్కూలు(6 నుంచి 10 వరకు) ఏర్పాటు కానున్నాయి. 60 మంది విద్యార్థులకు తక్కువ ఉంటే బేసిక్ స్కూలుగాను, 60 మంది పైబడితే మోడల్ ప్రైమరీ స్కూలుగా ఏర్పాటు చేస్తారు. బేసిక్ స్కూలులో ముగ్గురు టీచర్లు ఉంటే, మోడల్ ప్రైమరీలో ఐదుగురు టీచర్లను నియమించనున్నారు. మండలంలో 36 బేసిక్ స్కూళ్లు, 8 మోడల్ ప్రైమరీ స్కూళ్లు, 4 అప్పర్ ప్రైమరీ, 9 హైస్కూళ్లు ఉండనున్నట్టు ఎంఈఓ-1 వై.సత్యనారాయణ, ఎంఈఓ-2 భగవతి తెలిపారు. క్లస్టర్ హెచ్‌ఎంలు సుమతీ, హేమంత్‌కుమార్, కోమలి చిత్ర, గోపిగోవర్థన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. ఈ నివేదికలు జిల్లా విద్యాశాఖాధికారికి నివేదించనున్నారు.

# యువకుడిపై దాడి

**పడవ ధ్వంసం**



వేగేశ్వరపురంలో గోదావరి వద్ద పడవను నదిలోంచి తీస్తున్న దృశ్యం

**తాళ్లపూడి:** వేగేశ్వరపురంలో యువకుడిపై దాడి చేయడంతో పాటు, అతని పడవను కూడా ధ్వంసం చేసిన ఘటన చోటు చేసుకుంది. తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వేగేశ్వరపురం గ్రామానికి అగ్నికులక్షత్రీయ యువకుడు మల్లాడి రత్నకుమార్ 15వ తేదీన గ్రామంలోని సంక్రాంతి సంబరాలకు వెళ్లి మోటారుసైకిల్‌పై ఇంటికి వస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కావూరి ఆదర్శ్, బట్టు రవితేజ, అల్లాడి చంటి అనే యువకులు మోటారు సైకిల్‌ను ఆపి రోడ్డుపై పడేసి కొట్టారని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అంతే కాకుండా ఇంటికి వచ్చి చంపేస్తానని బెదిరించినట్టు చెప్పారు. ఈ నేపథ్యంలోనే గోదావరి మేరీమాత ఆలయం సమీపంలో గోదావరిలో యాంకర్ వేసిన చేపల వేటకు వెళ్లే తన పడవను నదిలో తిరగవేసి, పడవను ధ్వంసం చేసి, అందులో ఉన్న ఇంజిన్‌ను దొంగిలించారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

# వైభవంగా నంగాలమ్మ గరగోత్సవం



అమ్మవారి గరగలు ఎత్తుకున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి

**నిడదవోలు :** సంక్రాంతి సందర్భంగా పట్టణంలో నంగాలమ్మ అమ్మవారి పూరిగుడి వద్ద ఐదో రోజు శుక్రవారం గుడ్ల వంశీల ఆధ్వర్యంలో అమ్మవారి గరగోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నంగాలమ్మ తల్లి గరగలను మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి ఎత్తుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో ప్రధాన సెంటర్ల గుండా గరగలతో ఊరేగారు. భక్తులు అమ్మవారి గరగల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మంగళ హారతులు, పసుపు కుంకుమతో పాటు అమ్మవారికి చీరలు సమర్పించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, జనసేన నాయకులు డాక్టర్ తోపరాల కల్యాణచక్రవర్తి, మద్దిపాటి ఫణింద్ర, గంగుల గోపియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ తప్పిదాలే ప్రమాదాలకు కారణం



కొవ్వూరు ఆర్టీసీ డిపోలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ విశ్వం

**కొవ్వూరు:** ఎక్కువ ప్రమాదాలు మానవ తప్పిదాలే కారమని పట్టణ సీఐ పి.విశ్వం పేర్కొన్నారు. కొవ్వూరు ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న భద్రతా మాసోత్సవాల ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. డ్రైవర్లు కచ్చితంగా విధి నిర్వహణలో మద్యం సేవించకూడదన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడడం, మత్తు పదార్థాలు సేవించడం, అజాగ్రత్త, ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించడం వంటివి చేయకూడదన్నారు. డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ మాట్లాడుతూ డ్రైవర్ల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఏటా మెడికల్ చెకప్ చేయిస్తున్నామన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకూ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. డ్రైవింగ్‌లో మెళకువలు అలవర్చుకుని ప్రమాద రహిత ప్రయాణం కొనసాగేటట్లు ప్రతి ఒక్క డ్రైవర్ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు బస్సుల మెయింటెన్స్, 22, 23వ తేదీల్లో సెఫ్టీ డ్రైవింగ్ అలవెన్స్ ఇవ్వడం, 24న డ్రైవర్స్ దినోత్సవం, 25 నుంచి 28వ తేదీ వరకూ రోడ్డు భద్రతాపై శిక్షణ, 29 నుంచి ఫిబ్రవరి నాలుగో తేదీ వరకు మెడికల్ ఎక్సమినేషన్, 5, 6వ తేదీల్లో ఫ్యామిలీ కౌన్సిలింగ్ అందిస్తామన్నారు. 7వ తేదీ నుంచి పదో తేదీ వరకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులు, 11, 12వ తేదీల్లో రక్తదాన శిబిరాలు, 13, 14వ తేదీల్లో రోడ్డు భద్రతపై ఆడిట్, 15న మాసోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించనున్నట్టు డీఎం ప్రకటించారు.

# ఆత్మీయ వేడుక.. ఆనందాలకు వేదిక



తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



చిన్నాయిగూడెంలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

**నిడదవోలు రూరల్:** ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఒకే బడిలో కలిసి చదువుకుని వారంతా విడిపోయి ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. మళ్లీ 21 ఏళ్ల తర్వాత గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కలుసుకున్నారు. తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా శుక్రవారం అదే పాఠశాలలో కలుసుకుని ఆనందంగా గడిపారు. అప్పటి హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు హెప్సిబా, కాపకాయల సూర్యనారాయణలను ఘనంగా సత్కరించారు. అనంతరం అందరూ కలిసి విందు భోజనం చేశారు. పూర్వవిద్యార్థులు జి.ప్రసాద్, వి.నాగేశ్వరరావు, జిలాని, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

**దేవరపల్లి:** చిన్నాయగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్లో 2002-03లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పూర్వపు గురువులతో పాటు 96 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆనాటి స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా సందడి చేశారు. విదేశాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో వివిధ ఉద్యోగాల్లో స్థిరపడిన వారందరూ కుటుంబ సమేతంగా తరలివచ్చారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత అందరూ ఒకే వేదికపై కలవడంతో ఆత్మీయ పలకరింపులు, ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనందం వ్యక్తం చేశారు. కుటుంబాల యోగ క్షేమాలను తెలుసుకుంటూ అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. దుబాయ్, ఆస్ట్రేలియా దేశాలతో పాటు బెంగళూరు, హైదరాబాద్, ఇతర రాష్ట్రాల నుంచి పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి హాజరయ్యారు. ఆనాటి గురువులు ఎస్.కిరణ్ బాబు, వి.సూర్యనారాయణ మూర్తి, జె.వీరభద్రరావు, చిట్టిబాబు, నారాయణమ్మ, పీఈటీ ప్రకాష్ రెడ్డి, వెంకటేశ్వరరావు, కాటం బాబు, కాటం రాజు, హరిబాబు పాల్గొన్నారు.

# ఔను.. వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు

- వృద్ధాశ్రమంలో ఇష్టపడిన వృద్ధులు
- వారిద్దరినీ కలిపిన నిర్వాహకుడు రాంబాబు, సిబ్బంది
- స్వర్ణాంధ్రలో వేడుక



వృద్ధ దంపతులతో స్వర్ణాంధ్ర నిర్వాహకుడు రాంబాబు, సిబ్బంది

**సీటీఆర్ఐ:** ఆమె వయసు 68, అతడికి 64.. వీరిద్దరూ నగరంలోని స్వర్ణాంధ్ర ఆశ్రమంలో ఉంటున్నారు. ఒకరినొకరు ఇష్టపడినా బయటకు చెప్పడానికి సంకోచించారు. ఎట్టకేలకు ఆశ్రమ నిర్వాహకులు చొరవ తీసుకుని వారిద్దరినీ ఒకటి చేశారు. వివరాల్లోకి వెళితే.. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో కడప జిల్లా పెనగలూరు మండలం కమ్మలకుంటకు చెందిన 68 ఏళ్ల గొజ్జల రాములమ్మ, రాజమహేంద్రవరంలోని నారాయణపురం రెండో వీధికి చెందిన 64 ఏళ్ల మడగల మూర్తి ఉంటున్నారు. అక్కడ జరిగే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేవారు. అందరితో సఖ్యతగా ఉంటూ మంచి పేరు సంపాదించుకున్నారు. వీరిద్దరూ రెండేళ్లుగా ఆశ్రమంలో ఉంటున్నారు.

**మూర్తికి సేవలు**

మూర్తి పక్షవాతంతో తీవ్ర ఇబ్బందులు పడేవాడు. ప్రతి అవసరానికి ఎవరో ఒకరి మీద ఆధారపడేవాడు. ఆ సమయంలో అతడికి రాములమ్మ సేవలు చేసింది. కొంతకాలానికి అతడు అనారోగ్యం నుంచి కోలుకున్నాడు. సేవలు చేస్తున్న సమయంలో రాములమ్మ, మూర్తి ఒకరికొకరు ఇష్టపడ్డారు. కానీ ఆ విషయం బయటకు చెబితే ఏమనుకుంటారో, ఆశ్రమం నుంచి పంపించేస్తారేమోనని భయపడ్డారు. అయితే ఆశ్రమంలో మిగిలిన వారు వీరిద్దరి విషయాన్ని నిర్వాహకుడు గుబ్బల రాంబాబుకు తెలిపారు.

**దండలు మార్పించి..**

రాంబాబు, పెద్దలు, అక్కడ ఉన్న వృద్ధులు, సిబ్బంది అందరూ కలిసి చర్చించుకుని రాములమ్మ, మూర్తికి మద్దతుగా నిలిచారు. శుక్రవారం వారిద్దరికీ దండలు మార్పించారు. ఒకరికొకరు తోడు నీడగా ఉండాలని సూచించారు. స్వర్ణాంధ్ర తరఫున రాంబాబు నూతన వస్త్రాలను బహూకరించారు. కేకు కట్ చేసి వృద్ధులకు మిఠాయిలు, అందరికీ తువాళ్లు పంపిణీ చేయించారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సిబ్బంది హరికృష్ణ, మీరా కుమారి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

### ఖైదీల కేసుల దర్యాప్తుపై సూచనలు

**కంబాలచెరువు:** విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు చేసే విధానంపై పోలీసు అధికారులకు జిల్లా ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివకుమార్ పలు సూచనలు చేశారు. ఈ మేరకు జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం అండర్ ట్రయిల్ రివ్యూ, ఎగ్జిక్యూటివ్ కమిటీల సమావేశాలు నిర్వహించారు. బెయిల్, జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించి, సంబంధిత అధికారులకు సిఫారసులు చేశారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు, ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్ కె.జానీబాషా, జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.